ఏరియా ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల, సూపరింటెండెంట్ త్రిలోక్ శ్యామ్

ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: ఎంఎన్ మలక్‌పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్థానిక ఎమ్మెల్యే, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ అహ్మద్ బలాల అన్నారు. ఆస్పత్రిలో సూపరింటెండెంట్, ఆయా విభాగాల హెచ్‌ఓడీతో శనివారం ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి గణాంకాల సమీక్ష, ఆసుపత్రిలో సమస్యలు, సౌకర్యాలపై చర్చించారు. ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ.. ఆసుపత్రిలో అన్ని రకాల వసతులు కల్పిస్తామని, ఇన్‌పేషంట్ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరమైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫీజియోథెరపీ డిపార్ట్‌మెంట్‌లో 'షార్ట్‌వేవ్ డయాథెర్మీ', ఆర్థోపెడిక్ విభాగంలో సీ–ఆర్మ్ మిషన్లను ఎమ్మెల్యే మంజూరు చేశారని సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యామ్ తెలిపారు. ఆర్‌ఎంఓ డాక్టర్ మల్లికార్జునప్ప, సొసైటీ మెంబర్స్ డాక్టర్ సలీముల్లాఖాన్, అలీమ్, నజీమా పాల్గొన్నారు.

బక్రీద్ వ్యర్థాల కోసం కవర్లు అందజేత



సైదాబాద్‌లో మసీదుల వద్ద కవర్లు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్: బక్రీద్ వేడుకల సందర్భంగా వెలువడే వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ ద్వారా అందిస్తున్న ప్లాస్టిక్ కవర్లలో మాత్రమే పడవేయాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి ముస్లిం సోదరులను కోరారు. శనివారం కార్పొరేటర్ సైదాబాద్ పరిధిలోని హనాఫియా మసీదు, క్యూబా మసీదు, ఖాద్రియా మసీదు, బిలాల్ మసీదుల వద్ద ముస్లిం సోదరులకు ప్లాస్టిక్ కవర్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జీవవ్యర్థాలు మాంసాహార వ్యర్థాలను రహదారులు, చెత్తకుండీల వద్ద పడవేస్తే పలు ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. అందుకని వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో మాత్రమే వేసి జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య వాహనాలకు అందజేయాలని కోరారు. సైదాబాద్ వాసులు మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు కార్పొరేటర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్గత రహదారుల నిర్మాణానికీ ప్రాధాన్యం



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారుల నిర్మాణానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి తెలిపారు. శనివారం కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని బాలజీనగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ఆయా శాఖల అధికారులతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, నాయకులు రేణుకా ముదిరాజ్, అజయ్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



శ్రీరమణ కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడతాయని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శనివారం డివిజన్‌లోని శ్రీరమణకాలనీ ఫేజ్–2లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హస్తినాపురం ఏఈ హేమూనాయక్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేశ్‌గౌడ్, మేడి మల్లికార్జున్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా భారత్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్

మన్సూరాబాద్: ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా భారత్ ఎదుగుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధి సౌత్‌ఎండ్ పార్కు కాలనీలో తన విజయం కోసం కృషి చేసిన నేతలను శనివారం ఈటల కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చాక నెహ్రూ తర్వాత దేశానికి వరుసగా మూడోసారి ప్రధాని అయిన ఘనత మోదీకే దక్కిందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే భారత్ 5వ ఆర్థిక దేశంగా ఎదిగిందని, త్వరలోనే 3వ ఆర్థిక దేశంగా మారబోతున్నదని స్పష్టం చేశారు. ఎల్‌బీనగర్‌లో తనకు అత్యధిక మెజార్టీ వచ్చిందని, అందుకు మొదటగా ఎల్‌బీనగర్ నేతలను కలుసుకుని ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి రెడ్డి, బీజేపీ నేత చింతల సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో మహిళలకే ప్రాధాన్యం



అబ్దుల్లాపూర్‌మెట్: కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో మహిళలకే పెద్దపీట వేయాలన్నదే రేవంత్ రెడ్డి సర్కారు లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శివాగార్డెన్స్‌లో శనివారం మండలంలోని 113 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రంగారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడుతారన్నారు. తహసీల్దార్ రవీందర్ దత్తు, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ బుర్రరేఖా, జెడ్పీటీసీ దాసుగౌడ్ పాల్గొన్నారు.



పాదచారుల వంతెన మెట్లు



నూతనంగా నిర్మించిన సబ్‌వే

ప్రారంభానికి ఆర్‌యూబీ సిద్ధం

- మలక్‌పేటలో రూ.35.44 కోట్లతో నిర్మాణం
- తీరనున్న రైల్వే ప్రయాణికులు, పాదచారుల కష్టాలు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలో రైల్వే ప్రయాణికులు, పాదచారుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. రూ.35.44 కోట్ల వ్యయంతో చేపట్టిన మలక్‌పేట రైల్వే మూడో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కాచిగూడ స్టేషన్‌కు ఒక స్టాప్ ముందు మలక్‌పేట స్టేషన్‌లో పాతనగరం పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రయాణికులు నిత్యం వేల సంఖ్యలో రైళ్లు దిగుతుంటారు. రైలు దిగిన అనంతరం పాదచారులు వంతెన ద్వారా రోడ్డు దాటి మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, సంతోష్‌నగర్, సైదాబాద్ ప్రాంతాలకు వెళ్లేవారు. మలక్‌పేట 3వ ఆర్‌యూబీ నిర్మాణం కోసం 2021 సంవత్సరంలో పాదచారుల వంతెనను కూల్చివేశారు. అప్పటి నుంచి ఇక్కడ రోడ్డు దాటేందుకు రైలు ప్రయాణికులు, పాదచారులకు కష్టాలు మొదలయ్యాయి.

గతేడాది ఆగస్టులో శంకుస్థాపన...

నగరంలో అత్యంత పురాతన సబర్బన్ రైల్వే స్టేషన్‌లో మలక్‌పేట ఒకటి. మలక్‌పేట నియోజకవర్గానికే కాకుండా పాతనగరంలోని సుమారు వంద కాలనీల ప్రజలకు ఏకైక రైల్వే స్టేషన్ ఇది. ప్రస్తుతం సుమారు 60 రైళ్లు ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం రోజుకు ఆరు వేల నుంచి ఏడు వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. శివారు ప్రాంతాలైన శంషాబాద్, షాద్‌నగర్, మహబూబ్‌నగర్, గద్వాల తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం ఈ స్టేషన్ నుంచి ప్రయాణిస్తుంటారు. ఇటీవల రైళ్ల సంఖ్య పెరగడంతో మూడేళ్ల కిందట ప్లాట్‌ఫారాల పొడవు పెంచేందుకు చర్యలు చేపట్టారు. అమృత్ భారత్ స్టేషన్లలో ఒకటిగా ఎంపిక కావడంతో రూ.35.44 కోట్ల వ్యయంతో స్టేషన్ ఆధునీకీకరణ పనులకు 2023 ఆగస్టులో ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఈ ఆర్‌యూబీ నిర్మాణంతో ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. కాగా, రెండు మూడు రోజుల్లో ఈ వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం




కల్యాణంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, సామ రంగారెడ్డి

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, కార్పొరేటర్లు అరుణ సురేందర్, కొప్పుల నరసింహారెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, ఆలయ చైర్మన్ వంశీ, మాజీ చైర్మన్ అనంతుల యాదగిరి రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అనంతుల సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సౌభాగ్యపురం కాలనీలో...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీలోని అలివేలుమంగా పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సుధాకర్ గుప్తా, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, కోశాధికారి ఎంఆర్‌కే మూర్తి, కాలనీ సెక్రటరీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సైదాబాద్‌లో వృద్ధుడి అదృశ్యం



ఉయ్యాల లింగయ్య

సైదాబాద్: మద్యం కోసమని బయటకు వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయాడు. సైదాబాద్ ఎస్‌ఐ నాగోజు శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పూసలబస్తీలో నివసించే ఉయ్యాల లింగయ్య (75) ఈనెల 4న మద్యం కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే ఆ రోజు ఎన్నికల ఫలితాల వెల్లడి నేపథ్యంలో మద్యం దుకాణాలను తెరవ లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన లింగయ్య తిరిగి రాకపోవడంతో ఆయన కుమారుడు ఉయ్యాల నాగరాజు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా తండ్రి ఆచూకీ దొరకలేదు. కుమారుడి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనాథగా మారిన విద్యాశాఖ

వేముల రామకృష్ణ

కాచిగూడ: పర్యవేక్షణ లేని అనాథగా విద్యాశాఖ మారిందని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా అనిల్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణలు శనివారం నియామకపు పత్రాన్ని అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దే విద్యాశాఖకు నేటి వరకు మంత్రిని ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. విద్యాశాఖను చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్కరోజు కూడా విద్యాశాఖ గూర్చి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నేతలు ప్రవీణ్, సాయి వర్ధన్ పాల్గొన్నారు.

బాక్స్ డ్రెయిన్లతో సత్ఫలితాలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



చీఫ్ ఇంజినీర్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్‌బీనగర్: బాక్స్ డ్రెయిన్ పనులతో సత్ఫలితాలను ఇస్తున్నాయని, నియోజకవర్గంలో వరద సమస్య చాలా వరకు పరిష్కారమైందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ జియావుద్దీన్ శనివారం ఎస్‌ఎన్‌డీపీ, జీహెచ్‌ఎంసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే చీఫ్ ఇంజినీర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎస్‌ఎన్‌డీపీ పనులు 70 శాతం పూర్తయ్యాయని అన్నారు. ఇంకా కొన్ని డివిజన్లలో పూర్తి స్థాయిలో డ్రెయిన్ల నిర్మాణం చేపడితే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ న్యూగడ్డిఅన్నారంలో వరద నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఐఎస్ సదన్ నుంచే వచ్చే నూతన డ్రైన్ కారణంగా సమస్య వస్తోందని, నూతన బాక్స్ డ్రెయిన్ నిర్మించాలని కోరారు. మన్సూరాబాద్, హస్తినాపురంలో కూడా నూతన బాక్స్ డ్రైన్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. సమస్యలపై స్పందించిన చీఫ్ ఇంజినీర్ సమీక్ష సమావేశం నిర్వహించి యుద్ధప్రాతిపాదికన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో అధికారులు అశోక్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, కార్తీక్. మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, భవాని ప్రవీణ్, నాయకులు సత్యంచారి, శ్రీనివాస్, రవిముదిరాజ్ పాల్గొన్నారు.

వీసీలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాజేశ్వర్‌యాద్

చంచల్‌గూడ: కొత్తగా నియమించే యూనివర్సిటీ వైస్ చాన్సలర్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రధాన్యం ఇవ్వాలని బీసీ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది ఎ.రాజేశ్వర్‌యాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశారు. వివిధ కార్పొరేషన్లలో బోర్డు డైరెక్టర్లుగా 50 శాతం బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. సంఘం సభ్యులు సత్యనారాయణ, గోద కన్న యాదవ్, జగదీష్, సాయి, రాహుల్ పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్స్ ప్రారంభం



మాట్లాడుతున్న ఐసీఎం అధికారి

ఇబ్రహీంపట్నం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించి పలు సేవ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఇండియన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అధికారి (ఐసీఎం) శ్యాంకుమార్ పేర్కొన్నారు. కేంద్ర కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ వారి సహకారంతో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సెక్రటరీలకు, రైతులకు దండుమైలారం పీఏసీఎస్‌లో శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల అభివృద్ధికి చేపడుతున్న సేవలను వివరించారు. సొసైటీల్లో కామన్ సర్వీస్ సెంటర్స్ ఓపెన్ చేసి మీసేవ మాదిరిగా ప్రజలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు, గ్యాస్ బుకింగ్‌లు, ఆధార్ కార్డుల మార్పులు, చేర్పులు తదితర పలు సేవ కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చునన్నారు.

పచ్చని చెట్లతోనే మానవాళికి మనుగడ

జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్



మొక్కకు నీరు పోస్తున్న కమిషనర్

పహాడీషరీఫ్: మానవాళి మనుగడ కోసం ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుషులకు ప్రాణవాయువు ఇచ్చే చెట్లను పరిరక్షించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కల పెంపకాన్ని ఇంట్లోని పిల్లల మాదిరిగా చూసుకోవాలన్నారు. చెట్లు విరివిగా ఉంటేనే వర్షాలు కూడా విస్తారంగా కురుస్తాయని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటి సంరక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నిర్మల, ఏఈ ఇష్రత్ ఆయేషా, హరితహారం ఇన్‌చార్జి సుదీర్, పర్యావరణ అధికారి శ్రీనివాస్‌తో పాటు బుడుమాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యా బోధన

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సంజీవయ్యనగర్ బాగ్‌మూసారిమో స్కూల్లో శనివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్‌లో చదువుకుంటున్న ఐదేళ్లకు పైబడిన పిల్లలను పాఠశాలలో చేర్పించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనతో పాటు చిన్నారులకు యూనిఫామ్స్, పుస్తకాలు, నోట్‌పుస్తకాలను ఉచితంగా ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు కవిత, లక్ష్మి, సీతారాంరెడ్డి, విమల, శ్రీనాథ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య సింధులో ఉచిత కంప్యూటర్ శిక్షణ

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ కృష్ణానగర్ కాలనీలోని కరుణశ్రీ సేవాసమితి ఆధ్వర్యంలో కారుణ్య సింధు ఆశ్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామని సేవాసమితి ప్రధాన కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ఆశ్రమం కార్యాలయంలో విలేకరులకు ఈ విషయం తెలిపారు. ఆశ్రమంలో ఆదివారం 4వ బ్యాచ్ ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను శ్రీత్రివేణి పాఠశాల డైరెక్టర్ కర్ర గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని అన్నారు. 10వ తరగతి, ఆపైన చదువుకున్న ఆసక్తి గల విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వరద కాలువ పనులు వేగవంతం చేయండి



ఎంఆర్‌ఆర్ కాలనీలో కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చంపాపేట: చంపాపేట డివిజన్‌లోని పలు లోతట్టు కాలనీల్లో ఎస్‌ఎన్‌డీపీ నిధులతో చేపట్టిన వరదనీటి కాలువ పనులు వేగవంతం చేయాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆయన ఎస్‌ఎన్‌డీపీ అధికాలరతో కలిసి ఉదయ్‌నగర్, ఎంఆర్‌ఆర్ కాలనీల్లో ప్రారంభించిన వరదనీటి కాలువ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌డీపీ అధికారులు కృష్ణయ్య, వెంకట్‌కిరణ్ రెడ్డి, సర్కిల్ సిబ్బంది రాజు, సురేష్, జలమండలి మేనేజర్ రమ్య భారతి, కాలనీ ప్రతినిధులు యాదగిరి, విశ్వం, బుచ్చిరెడ్డి, అమర్, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

తాటి చెట్లను తొలగించనీయొద్దని వినతి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: పొల్కంపల్లి గ్రామపరిధిలోని తాటి చెట్లను తొలగించకుండా చర్యలు చేపట్టాలని గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమ సంఘానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కల్లు పారే తాడిచెట్లను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గౌడ్లకు జీవనోపాధి కల్పించే తాటి చెట్లను తొలగించొద్దని.. తొలగించిన వారిపై చర్యలు తీసులుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు బాబయ్యగౌడ్, కార్యదర్శి మల్లేష్‌గౌడ్, వెంకటేశ్, బాలరాజు, ధనంజన్, కాటంరాజు, మహేశ్, జంగయ్యలు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు



ఘట్టుపల్లిలోని వీరాంజనేయ స్వామి

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పాలంకరణతో పాటు తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు చేశారు. శనివారం కావడంతో మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయ స్వామి ఆలయ పూజారి తొండుపల్లి సంతోష్ శర్మ, వీరేశం, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



జల్‌పల్లిలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న కేఎల్లార్

పహాడీషరీఫ్: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ బుడుమాల యాదగిరి జన్మదినం సందర్భంగా సొంత డబ్బులతో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దీపభాస్కర్ రెడ్డి, షేక్ జహంగీర్, లక్ష్మీనారాయణ, మన్న రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 47, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 60, కాకర 47, బీర 75, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 23, క్యారెట్ 40, దొండ 35, ఆలు 34, ఉల్లి 39, గోకర 50, దోస 25, సొర 13, పొట్ల 18, అరటి 11.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365